

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**ముఝ్ కొ ఇస్ రాత్‌కి తన్హాయిమె ఆవాజ్ నదో**

**జిస్కి ఆవాజ్ రులాదే ముఝె వో సాజ్‌నదో , ఆవాజ్ నదో...**

విషాద గీతాలు పలురకాలు. విషాదానికి కారణాలు అనంతం. కానీ మన సినిమాలలో అధిక శాతం విషాదం ప్రేమ సంబంధం. ప్రేమలో వైఫల్యం, ప్రేయసి దూరమవటం, ప్రేమలో అపోహలవల్ల వేరు పడటం, ఎవరో ఒకరికి మాట ఇవ్వటం వల్ల ఒకరినొకరు కలవకపోవటం, పలుకారణాల వల్ల ప్రేమించిన వ్యక్తిని కాక మరొకరిని వివాహం చేసుకోవాల్సి రావటం... ఇలా విషాదంలో రూపం వేరైనా ప్రధానంగా కారణం మాత్రం ప్రేమ చుట్టూ తిరుగుతుంది. అక్కడక్కడా కొన్ని కొన్ని విషాద గీతాలు ప్రేమేతర కారణాల ఆధారంగా ఉన్నా, అధిక శాతం విషాదగీతాలు మాత్రం ప్రేమ సంబంధించినవి అయి ఉంటాయి. వీటిల్లో పురుషుల విషాద గీతాలకు, మహిళల విషాదగీతాలకు తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మహిళల కోసం రాసిన విషాదగీతాలను కూడా పురుషులే రాయటం వలననేమో, మహిళల విషాద గీతాలనేకం విరహవేదనను, తపనను ప్రదర్శించే గీతాలు. అంతేకాదు, అనేక పురుష విషాద గీతాలు, కొద్ది మార్పుతో స్త్రీల విషాదగీతాలుగా రూపొందాయి.

అందుకు చక్కటి ఉదాహరణ 'దిల్ భీ తేరా హం భీ తేరే' సినిమాలో కళ్యాణ్ జీ ఆనంద్‌జీ సంగీత దర్శకత్వంలో షమీమ్ జైపురి రచించిన గీతం . షమీమ్ జైపురి ప్రధానంగా కవి. ఆ కాలంలో స్వీయ గళంలో ముషాయిరాల్లో ఆయన కవితలను గానం చేస్తూంటే శ్రోతలు పరవశించిపోయేవారు. ఆయన జిగర్ మురాదాబాది వంటి వారి ప్రభావంతో సినీరంగంలో ప్రవేశించాడు. అతని అసలు పేరు ఫహీమూల్ హసన్. అప్పటికే సినీరంగంలో హస్రత్ జైపురి స్థిరపడి ఉన్నాడు గేయ రచయితగా. దాంతో ఇద్దరు జైపురిల నడుమ పోలికలు వచ్చాయి. షమీమ్ జైపురి ప్రధానంగా కవి కావటంతో, ఆయన సినీ ప్రపంచంలో నిలదొక్కుకోలేకపోయాడు. ఇక్కడ ప్రతిభ ఒక్కటే స్థిరపడేందుకు సరిపోదని గ్రహించి త్వరలోనే సినీరంగం వదిలి సాహిత్యరంగం వైపే పూర్తి దృష్టిని కేంద్రీకరించాడు. ఆయన రచించిన పాటల్లో 'దిల్ భీతేరా, హం భీతేరా' సినిమాలో ఈ పాట, 'రాజ్' సినిమాలో 'అకేలే హై, చలే ఆవో' పాటలు ప్రజాదరణ పొందాయి. ఈ రెండు పాటలు కూడా మగగొంతులోనూ, మహిళ గొంతులోనూ వేర్వేరుగా ఉండటం విశేషం. ఈ రెండు సినిమాలకు సంగీత దర్శకులు కళ్యాణ్‌జీ ఆనంద్‌జీలు.

కళ్యాణ్‌జీ ఆనంద్‌జీలు 'శంకర్ జైకిషన్' అనుకరణతో తమ కెరీర్‌ను స్థిరపరచుకున్నారు. నెమ్మదిగా తమకంటూ ప్రత్యేక బాణీ సృజన పద్ధతిని ఏర్పరచుకున్నారు. హిట్ సంగీత దర్శకులుగా పేరు పొందారు. అన్నిటికన్నా ముఖ్యంగా సహృదయులుగా పేరు పొందారు. ఈనాడు పేరు పొందిన గాయనీగాయకులు అనేకులు వారి వద్ద శిక్షణ పొందినవారే. ప్రఖ్యాత సంగీత దర్శకులు లక్ష్మీకాంత్ ప్యారేలాల్ కళ్యాణ్‌జీ ఆనంద్జీ వద్ద అసిస్టెంట్‌లుగా, వాయిద్య కారులుగా పనిచేశారు. కళ్యాణ్‌జీ స్వయంగా హేమంత్ కుమార్ వద్ద వాయిద్యకారుడిగా పనిచేశాడు. 'నాగిన్' సినిమాలో 'మన్ డోలే మెర తన్ డోలే' పాటలో వినిపించే 'బీన్ స్వరాన్ని 'క్లావయొలిన్' పై వాయించింది కళ్యాణ్‌జీయే. తరువాత, తాము స్వతంత్ర సంగీత దర్శకులయిన తరువాత హేమంత్ కుమార్‌తో వీలయినప్పుడల్లా పాటలు పాడించి తమ కృతజ్ఞత ప్రకటించుకున్నారు. అయితే వీరు ముకేష్ 'సెకండ్ ఇన్నింగ్స్ 'లో, ముకేష్ ఉచ్చస్థాయి గాయకుడిగా నిలవటంలో ప్రధాన పాత్ర పోషించారు.

ఇప్పుడు సినీప్రపంచంలో 'నెపోటిజం గురించి' 'కుట్రలు కుతంత్రాల గురించి' చర్చలు జరుగుతున్నాయి కానీ అవిలేనిదే మానవ ప్రపంచమే లేదు. అసూయా, ద్వేషాలు మానవ మౌలిక లక్షణాలలో ప్రధానమైనవి. ముకేష్, తలత్ మహమూద్‌లు గాయకులుగా సినీ రంగప్రవేశం చేశారు. పేరు సంపాదించుకున్నారు. కానీ అందరూ వాళ్ళని 'హీరో'ల్లా ఉన్నారని పొగడటంతో హీరోలయిపోవాలని కలలు గన్నారు. ప్రయత్నించారు. తలత్ మహమూద్ హీరోగా కొన్ని సినిమాల్లో నటించాడు. అవి అంతగా విజయవంతం కాలేదు. కానీ ఈలోగా అతడితో పాటలు పాడించుకోటానికి హీరోలు ఇష్టపడలేదు. దాంతో ఉచ్చస్థాయికి ఎదుగుతున్న తలత్ కెరీర్ పతనమయింది. ఈ నిజం గ్రహించి నటనకు స్వస్తి చెప్పి పాటలకే పరిమితమవుదామని నిర్ణయించుకునేలోగా మహమ్మద్ రఫీ ముందుకు దూసుకుపోయాడు. తలత్ మహమూద్ నెమ్మదిగా నేపథ్యంలోకి ఒదిగిపోయాడు.

ముకేష్ పరిస్థితి ఇంకా దయనీయం. ముకేష్, రాజ్‌కపూర్ స్వరంగా ఎదిగాడు. కానీ హీరో అవ్వాలన్న కోరిక అతని కొంప ముంచింది. మూడు సినిమాల్లో హీరోగా నటించాడు. ఓ సినిమా తనే నిర్మించాడు. కానీ ఏ సినిమా విడుదల కాలేదు. పాటలు విడుదలై 'హిట్' అయ్యాయి. కానీ సినిమాలు పూర్తికూడా కాలేదు. దాంతో ఆర్థికంగా చితికిపోయాడు. ఇదే సమయానికి రాజ్‌కపూర్‌తో సహా ఇతర నటులు ముకేష్ తమకు స్వరం అందించటానికి ఇష్టపడలేదు. దాంతో ముకేష్ కుటుంబం తినటానికి తిండిలేని పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. నటన అవకాశాలు ఎలాగూ లేవు, పాడే అవకాశాలూ అడుగంటాయి. ఇదే సమయానికి రాజ్‌కపూర్ మన్నాడేతో పాడించుకోవటం ఆరంభించాడు. దాంతో ముకేష్ 'మళ్లీ నటనవైపు కన్నెత్తి చూడనని' ఒట్టువేసుకుని, రాజ్‌కపూర్‌తో సంధి చేసుకున్నాడు. మళ్లీ పాటలు పాడటం ప్రారంభించాడు. ఇది అతడి సెకండ్ ఇన్నింగ్స్.

మధుమతి, యాహూది వంటి సినిమాలలో పాటలతో మళ్లీ అందరిదృష్టినీ ఆకర్షించినా ముకేష్ కెరీర్ ఇంతకుముందులా ఊపును అందుకోలేదు. సంగీత దర్శకులంతా ప్రధానంగా మహమ్మద్ రఫీ వైపే మొగ్గు చూపారు. ఈ సమయంలో కళ్యాణ్‌జీ ఆనంద్‌జీలు ముకేష్ కోసం ప్రత్యేకంగా పాటలు సృజించటం ప్రారంభించారు. ఆయా పాటలలో అధికశాతం విషాదగీతాలు కావటంతో, ముకేష్ స్వరం విషాద స్వరానికి హృదయంలా ఎదిగింది. అలాంటి పాటలలో 'ముఝ్‌కొ ఇస్ రాత్ 'కి పాట ఒకటి.

సాధారణంగా పురుష గాయకుడు, మహిళా గాయని పాడిన ఒకేరకమైన పాటలలో పురుష పాటలు అధికంగా ప్రజాదరణ పొందుతాయి. రెండూ ప్రజాదరణ పొందినా పురుషులు పాడిన పాటలే ఎక్కువగా వినిపిస్తాయి. ఇందుకు భిన్నంగా ఈ పాట ముకేష్ స్వరంలో ఎంత ప్రజాదరణ పొందిందో, లత స్వరంలోనూ అంతే ప్రజాదరణ పొందింది. ఇందుకు కారణం, ఇతర పాటల్లోలా కాకుండా ఇద్దరికీ చరణాలలో పదాలు, భావాలు భిన్నంగా ఉండటం. ఇందువల్ల రెండు పాటలు దేనికదే ప్రత్యేకంగా ఎదిగాయి. ఇక్కడే గేయ రచయిత ప్రాధాన్యం స్పష్టమవుతుంది.

స్త్రీ, పురుషుల స్వరాల నాణ్యతలు వేర్వేరు. పురుషుల స్వరం ఉచ్చస్థాయిలో కూడా మధురంగా ఉండే వీలుంటుంది. కానీ మహిళల స్వరం ఉచ్చస్థాయిలో 'కీచు' అయిపోతుంది. స్థాయి భేదాలు వస్తాయి. దాంతో గాయని ఉచ్చస్వరంలో పాడి మెప్పించటం కష్టం. అయితే నూర్‌జహాన్, షమ్షాద్ బేగం వంటి గాయనిలకు ఉచ్చస్వరం పెద్ద సమస్య కాదు. వారి స్వరం ఆరంభమే ఉచ్చస్థాయిలో ఆరంభమవుతుంది. దాంతో ఎంత ఎత్తయినా వారి స్వరాలు మెట్లు  సులభంగా ఎక్కేస్తాయి.

**ఆవాజ్ దే కహాఁహై, దునియా మెరీ జవాన్ హై**

**ఆ బాద్ మేరే దిల్‌మే ఉమ్మీద్ కా జహాన్ హై**

'అన్‌మోల్ ఘడీ'లో ఈ పాట నూర్‌జహాన్ స్వరంలో వింటుంటే హృదయాన్ని ఆకర్షిస్తుంది. ఎదలోలోతుల్లో స్పందనలు కలిగిస్తుంది. ఆమె 'ఆవాజ్ దే ' అంటూ ఆరంభించగానే  ఉచ్చస్థాయి మాధుర్య శిఖరారోహణం ప్రారంభమయిపోతుంది. 'ఆబాద్ మేరే దిల్మే' అంటూ 'హై

పిచ్'లో ఆమె ప్రాణాలను లాగుతుంటే ఎంత సాగదీస్తే అంత ఆనందం కలుగుతుంది. కానీ లతా మంగేష్కర్ స్వరం వీరి అంత శక్తికలది కాదు. హై పిచ్‌లో కీచు గొంతు అవుతుంది. అయితే పురుషులలో రఫీ, మన్నాడేలు అత్యంత సులభంగా హై పిచ్‌కి వెళ్లగలరు. వీళ్లు పాడిన పాటలను గాయని పాడేటప్పుడు బాణీలో మార్పులు కొద్దిగా చేయాల్సి ఉంటుంది. కానీ ముకేష్ పాటలతో ఈ సమస్యరాదు. ఎందుకంటే ముకేష్ స్వరం కూడా ఉచ్చస్థాయిలో పాడలేదు. పైగా ముకేష్ శాస్త్రీయ సంగీతంలో అంత ప్రావీణ్యం ఉన్నవాడు కాదు. దాంతో ముకేష్ పాడిన పాటలు లత పాడటంలో పెద్ద సమస్య రాదు. బాణీలో కూడా పెద్ద మార్పులు అవసరం ఉండదు. అందుకే ముకేష్, లతలు ఒకే బాణీని వేర్వేరుగా పాడినవి సమానస్థాయిలో ప్రజాదరణ పొందాయి. 'రాత్ ఔర్ దిన్ దియా జలే ', 'ఆ లౌట్ కె ఆజా మెరే మీత్ ', 'కభీ కభీ మెరె దిల్మే ' వంటి పాటలు చక్కటి ఉదాహరణలు.

గేయరచయితలు బాణికి తగ్గ పదాలు కూర్చే సమయంలో బాణీతోపాటు పాడే గాయనీ గాయకుల స్వరాలను, వారు పదాలను పలికే విధానాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, భావాలను ప్రదర్శించటంలో కూడా, పురుషులకు, స్త్రీలకూ నడుమ ఉన్న మానసిక వ్యవస్థలోని భేదాలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది.

**రోష్నీ హో న సకీ దిల్‌భి జలాయా మైనే**
**తుం కొ భూలాభి నహీ లాఖ్ భులాయా మైనే**
**మై పరేషాన్ హు, ముఝే ఔర్ పరేషాన్ న కరో**
**ఆవాజ్ నదో.**

ఇది ముకేష్ పాడే చరణం. కాస్త పురుషాహంకారం, ఆధిక్యం కనబడటం తప్పనిసరి. వెలుగు కాలేకపోయాడు. వెలుగు కోసం హృదయాన్ని కూడా కాల్చుకున్నాడు. అంతటి దుర్భర విషాద పరిస్థితి నాయకుడిది. ఆమెని మరచిపోవాలని ప్రయత్నించాడు. బోలెడన్ని ఇతర విషయాలు మరచిపోయాడు కానీ ఆమెని మరవలేకపోయాడు. దాంతో ఇప్పటికే బోలెడంత బాధలో ఉన్నాడు. తనని పిలిచి ఇంకా బాధపెట్టవద్దని అంటున్నాడు. పురుషుడికి తాను స్త్రీకన్నా ఆధిక్యత సాధించాలని ఉంటుంది. అందుకే నాయకుడు ఆరంభించటమే వెలుతురు కావాలనుకున్నాను. కాలేకపోయాను. వెలుగుకోసం హృదయాన్నే జ్వలింపచేశాను అంటున్నాడు. ఆమెని మరవాలని ప్రయత్నించాడు. కుదరలేదు. అందుకని ఆందోళనలో చిరాకులో ఉన్నాడు. ఆమె గుర్తువచ్చి మరింత ఆందోళన కలుగుతోంది.

**మైనె అబ్ తుం సె న మిల్ నే కి కసం ఖాయీహై**
**క్యా ఖబర్ థీ కె మెరీ జాన్ పె బన్ ఆయీ హై**
**మై బహక్ జావు కసం ఖాకె తుం ఐసా న కరో**
**ఆవాజ్ నదో....**

ఆమె అతడిని కలవనని ఒట్టు వేసుకుంది. కానీ అది ఆమె ప్రాణాలకే ముప్పు తెచ్చిపెడుతుందని ఆమె అనుకోలేదు. ఆమె అతడిని కలవకుండా ఉండలేదు. కానీ మాట ఇచ్చింది కాబట్టి కలవలేదు. ఆమె అదే అంటోంది. నిన్ను కలవనని ఒట్టుపెట్టుకున్నాను. అది నా ప్రాణానికే ముప్పు తెస్తుందని నేను అనుకోలేదు. కానీ నువ్వు నన్ను పిలిచావో, నేను చేసిన వాగ్దానాన్ని, పెట్టిన ఒట్టును మరచిపోతాను. కాబట్టి నన్ను పిలవకు అంటోంది. మామూలు మాటలే కానీ లత స్వరంలో ఒదిగి తీవ్రమైన విషాద భావనను పొందుతాయి. ముకేష్ విషాదాన్ని పలికించటానికి పెద్ద ప్రయత్నం చేయనవసరంలేదు. ఒకోసారి ఆయన పాడిన హాస్యపాటలు కూడా విషాద గీతాల్లానే అర్థమౌతాయి. సినిమాలో హీరో నవ్వుతూ నటించే వరకూ విషాదపు పాటలే అనుకుంటాం.

కానీ లతా మంగేష్కర్ ఈ పాటలో పదాలను పలికిన తీరు, ఒకో పదాన్ని పలుకుతూ, ఆ శబ్దంలో తీవ్ర వేదనను ఒలికించిన తీరు పరమాద్భుతం. ఇక్కడ సంగీత దర్శకుడు రంగప్రవేశం చేస్తాడు.

హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంలో భైరవి రాగం సినీ కళాకారులకు అత్యంత ప్రియమైనది భైరవి. విషాద గీతాలకు ప్రధానంగా భైరవి రాగాన్ని వాడతారు హిందీ సంగీత దర్శకులు. 'బాబుల్ మోరా' అంటూ 'స్ట్రీట్ సింగర్'లో సైగల్ భైరవిరాగం ఆలాపించినప్పటి నుంచీ భైరవి 'హిందీ సినీ సంగీత ప్రపంచంలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించింది. శంకర్ జై కిషన్, నౌషాద్‌లు భైరవి రాగాన్ని అత్యద్భుతంగా వాడుకున్నారు. వీరిలో శంకర్ జైకిషన్ భైరవి రాగంతో చేసినన్ని ప్రయోగాలు మరే సంగీత దర్శకుడు చేయలేదు. ముఖ్యంగా విషాదరాగమైన భైరవితో 'చాహెకోయి ముఝే జంగ్లీ కహే ' లాంటి అల్లరి హుషారు పాటను సృజించటం వారి ప్రతిభకు దర్పణం పడుతుంది. ఇదే భైరవిని 'ఏయ్ మెరే దిల్ కహీన్ ఔర్ చల్' అంటూ వేగవంతమైన విషాదగీతంలా మలచటం, 'కైసె సంఝూవూ, బడి నా సమఝ్‌హో' అనే పోటీ పాటగా రూపొందించటం, 'బోల్ రాధ బోల్ సంగం హోగాకీ నహీ' అనే అల్లరి పాటగా మలచటం. 'హోటోంపె సచాయీ రహతీ హై' అనే గంభీరమైన గీతంగా ఎదిగించటం, 'ఛోడ్ గయే బాలం' అనే విషాద గీతం 'ఘర్ ఆయా మెర పర్దేశీ' అనే సంతోషకరమైన పాట.. ఇలా భైరవితో ఆడుకున్నారు శంకర్ జైకిషన్. భైరవిని 'సదా సుహాగన్ రాగ్ ' అంటే 'నిత్యం పుణ్యవతిలా కళకళలాడే రాగం'గా వారు అభివర్ణించారు. 'ముఝ్‌కొ ఇస్ రాత్ కి ' పాటను కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ భైరవి రాగంలో రూపిందించారు.

ఒకోసారి ఆలోచిస్తే సంగీత దర్శకుల ప్రతిభకు ఆశ్చర్యం అనిపిస్తుంది. సందర్భాన్ని బట్టి రాగం ఎంచుకోవాలి. ఆ రాగానికి తగ్గ పదాలను గేయరచయిత కూర్చేట్టు చూడాలి. రాగం చెదరకూడదు. భావం చెడకూడదు. తరువాత సరైన గాయనీ గాయకులను ఎంచుకోవాలి. తాము సృజించిన బాణీకి సంపూర్ణంగా న్యాయం చేకూర్చగల గాయనీ గాయకులను ఎన్నుకోవాలి. గాయనీ గాయకుల ప్రత్యేకతలు, వారి బలహీనతలను దృష్టిలో ఉంచుకోవాలి. 'బైజు బావరా' సినిమా పాటలను తలత్ మహమూద్‌తో పాడించాలని నౌషాద్ అనుకున్నాడన్న ఆలోచన వస్తే చాలు, పాటలు ఎలా ఉండేవో ఊహకు అందదు. ఎందుకంటే తలత్ స్వరం ఉచ్చస్థాయికి వెళ్లదు. అంతగా రాగాలు పలకలేదు. 'మన్ తరపత్ ', 'ఓ దునియాకే రఖ్ వాలే , ' 'ఇన్సాన్ బనో ' వంటి పాటలు తలత్ స్వరంలో ఊహించటమే కుదరదు. రఫీ ఆ పాటలు పాడటం కోసమే పుట్టాడు. ఆ పాటలు పుట్టింది రఫీ కోసమే అనిపిస్తాయి. అందుకే ముందు ఒక గాయకుడిని అనుకుని, తరువాత ఏవైనా పరిస్థితులవల్ల గాయకుడిని మారిస్తే, అదే బాణీని, ఆ గాయకుడికి తగ్గట్టు మలుస్తారు సంగీత దర్శకులు. అయితే సరైన గాయనీగాయకులను ఎన్నుకోవటంతో సరిపోదు.

బాణీ ఆరంభ సంగీతం, ఇంటర్ల్యూడ్ సంగీతాలు ఎలా ఉండాలి, ఏయే వాయిద్యాలు ఎంత మేరకు, ఎలా పలకాలి నిర్ణయించాలి. ముఖ్యంగా 'తాళం' నిర్ణయించాలి. 'ముఝ్‌కొ ఇస్ రాత్ కి' పాట ఆరంభంలోని 'స్ట్రింగ్ సెక్షన్' అద్భుతం. 'స్ట్రింగ్' అంటే 'తీగ'. తీగ వాయిద్యాలు అంటే గిటార్, వయొలిన్, వయోలా, సెల్లో, బాస్, బాంజో, మాండోలిన్ వంటివి. ఒక్కసారి కళ్లు మూసుకుని ఈ పాట ఆరంభం వింటే, ఒకో కన్నీటి చుక్క టపటప రాలుతూ, వేగం అందుకుని ఉధృతమైన వరదలా మారినట్టుంటుంది. ముఖ్యంగా, రాత్రిపూట చీకటిలో ఈ పాట వింటూంటే, దాని ప్రభావం అద్భుతంగా ఉంటుంది. ఒకో స్వరం శరీర పరిధి దాటి ఆత్మలోలోపల స్పందనలు కలిగిస్తూన్నట్టుంటుంది. మూట కట్టుకుని అజ్ఞాతంగా ఒదిగిన జన్మజన్మల విషాదం ఉబికి ఉబికి వస్తూన్న భావన కలుగుతుంది. పాట పూర్తిగా వినేసరికి గూడుకట్టుకున్న ఎన్ని జన్మల విషాదం ప్రక్షాళన కలిగిన అనుభూతి కలుగుతుంది. వింటూ, దుఃఖిస్తూ మనసును తేలిక చేసుకోవాలనిపిస్తుంది.

గుడిపూడి సుబ్బారావుగారు ఖమ్మం దగ్గర ఊళ్లో ఉంటారు. ఎనభై ఏళ్లపైన వయసు ఆయనది. ఈ పాట ఆయన జీవితంపై అత్యంత ప్రభావం చూపించిందని చెప్తారు. డిగ్రీలో ఉన్నప్పుడు ఒక సంవత్సరంపాటు ఈ పాటవింటూ సర్వం మరిచిపోయేవారట. ఈ పాట వింటూ దుర్భర విషాదాన్ని అనుభవిస్తూ డిగ్రీ ఒక సంవత్సరం తప్పారు. అందుకు ఆయన బాధపడలేదని చెప్తారు. ఇప్పటికీ, ఈ పాటలో, మైనె అబ్

తుం సె న మిల్నే కి కసం ఖాయీ హై అన్న పాదం చెప్తూంటేనే ఆయన గొంతు గద్గదికం అవుతుంది. కంట నీరు చిప్పిల్లుతుంది. అంత ప్రభావం ఉంది సంగీతానికి. సున్నిత మనస్కుల అంతరంగాలలో అలజడిని సృష్టిస్తాయి. జీవితాంతం చెరగని అనుభూతిని మిగులుస్తాయి. తరగని ఆనంద గనిని అందిస్తాయి.

ఇక్కడే మరో విషయం చెప్పుకోవాలి. పాటకు ప్రధానం తాళం. ఏ బాణీకి ఎలాంటి రిథంను, ఎలాంటి తాళాన్ని ఎంచుకోవాలో కూడా ఎంతో ప్రాధాన్యం వహిస్తుంది. ఈ పాటలో దాద్రా తాళాన్ని ఎంచుకోవటం, ఇంటర్ల్యూడ్‌లో సాక్సోఫోన్‌ను హృదయ విదారకమైన విషాదపు కేకలా వాయించటం పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది. పల్లవి భావాన్ని అనుభవించి చరణం కోసం సంసిద్ధం చేస్తుంది సాక్సోఫోన్. సాక్సోఫోన్‌ను ఓ.పి.నయ్యర్ 'హై దునియా ఉసీకే' అనే పాటలో అత్యద్భుతంగా విషాదాన్ని పండించేందుకు వాడేడు. ఆ పాట వింటూంటే అది రఫీ స్వరానికీ, సాక్సోఫోన్‌కీ నడుమ పోటీ పాటలా అనిపిస్తుంది. ఎవరిస్వరం ఎక్కువ విషాదాన్ని పండించిందో తేల్చుకోలేకపోతాం. అలాగే శంకర్ జై కిషన్ 'బేదర్దీ బాల్మా' పాటలో నాయిక విహ్వలమైన విషాదపు ఆక్రందన స్వరంలా పలికిస్తాడు సాక్సోఫోన్‌ను. అత్యద్భుతంగా ఉంటుందాపాట. లత స్వరం లేకుండా, సాక్సోఫోన్ లేకుండా ఆ పాటను ఊహించలేము. అదే సాక్సోఫోన్‌ను చిలిపిగా 'అజీ రూఠ్కర్ అబ్ కహా జాయియేగా' పాటలో, రొమాంటిక్‌గా 'తుం నే పుకారా ఔర్ హం చలే ఆయే'లోనూ వాడారు శంకర్ జై కిషన్. తుమ్నే పుకారాలో హీరోది దొంగ విషాదం. సాక్సోఫోన్ కూడా అలాగే పలుకుతుంది. మన సినీ సంగీత దర్శకుల ప్రతిభ ఎంత ఆశ్చర్యం కలిగిస్తుందో, అంతగా బ్రహ్మానందం కలిగిస్తుంది.

దాద్రా తాళం సాంప్రదాయిక తాళం. ప్రధానంగా విషాదగీతాలకు వాడతారు. అది ఈ పాటలో అద్భుతంగా కుదిరింది. ఎక్కడా ప్రధానంగా వినపడకుండా పాటను పట్టాలమీద నడిపిస్తూ ప్రభావాన్ని పెంచుతుంది. అందుకే ఈ పాట వింటూంటే ఓవైపు గేయరచయిత ప్రతిభకు ఆశ్చర్యం కలుగుతుంది. మరోవైపు గాయనీగాయకుల నైపుణ్యం ఆనందం కలిగిస్తుంది. ఇంకోవైపు సంగీత దర్శకుల సృజన స్వర్గపుటంచుల వరకూ ప్రయాణింప చేసిన అనుభూతిని కలిగిస్తుంది.

అనుభవించని అనుభూతులను అనుభవానికి తేవటం, తద్వారా మనిషిలోని సున్నిత భావనలను తట్టి లేపి, ఉత్తమ మానవుడిలా ఎదిగేందుకు తోడ్పాటు కలిగించటం ఉత్తమ కళ లక్షణం అయితే, సినీ సంగీతం అలాంటి లక్షణాలను పుష్కలంగా పొందుపరుచుకుంది. అర్థం తెలియకున్నా భావం బోధపడేరీతిలో రూపొందాయి పాటలు. అతి సంక్లిష్టమైన భావాలను అత్యంత అలతి పదాలలో పొందుపరచి, అతిక్లిష్టమైన రాగాలను అత్యంత సరళమైన రీతిలో రూపొందించి అందిస్తాయి సినీగీతాలు. సామాన్య శ్రోతకూడా ఈ పాటలు వినటం వల్ల తన ప్రమేయం లేకుండానే తనలోని సున్నితత్వాన్ని గుర్తిస్తాడు. మానవత్వాన్ని జాగృతం చేస్తాడు. ఉత్తమ మానవుడిలా ఎదుగుతాడు. ప్రతి వ్యక్తీ ఏదో ఓ సమయంలో ఒంటరిగా ఉంటూ గతాన్ని నెమరువేసుకుంటాడు. తాను కోల్పోయిన ప్రేమను, మరపుకురాని మధురానుభూతిని నెమరువేసుకుంటాడు. అలాంటి సందర్భాలలో సాంత్వననిచ్చేటటువంటి అద్భుతమైన గీతం 'ముఝ్‌కొ ఇస్ రాత్‌కి తన్ హాయి మె ఆవాజ్ న దో'. ఈ ఒంటరి రాత్రి నన్ను పిలవకు. ఎవరి స్వరం అయినే నాకు విషాదం కలిగిస్తుందో, ఆ స్వరప్రకంపనలు నాకు వినిపించకు అని అనుకోని మనిషి ఉండడు. అందుకే ఈ పాట ఒక రకమైన అమరత్వాన్ని సాధించింది. కాలాన్ని ఎదిరించి నిలుస్తోంది.

**(మరిన్ని మధురమైన పాటల్తో వచ్చేనెల...)**

Post your comments